# ఇండియన్ పాలిటీ

## గవర్నర్ అధికారాలు, విధులు

**కార్యనిర్వహణాధికారాలు:** రాజ్యాంగంలోని 154వ అధికరణ ప్రకారం రాష్ట్ర కార్యనిర్వహణాధికారం గవర్నర్‌కు ఉంటుంది. దీన్ని స్వయంగా లేదా తన కింది అధికారుల ద్వారా నిర్వహిస్తారు. 166వ అధికరణ ప్రకారం రాష్ట్ర పరిపాలన గవర్నర్ పేరుమీద జరుగుతుంది. గవర్నర్ నిర్వహించే విధులన్నింటిలోకి అత్యంత ముఖ్యమైంది ముఖ్యమంత్రిని నియమించడం (164(1) అధికరణ). విధానసభ ఎన్నికల్లో ఒక పార్టీ లేదా కూటమి స్పష్టమైన మెజారిటీ పొందినట్లయితే ముఖ్యమంత్రి ఎంపిక సులభం అవుతుంది. ఏ పార్టీకీ లేదా కూటమికీ మెజారిటీ రానప్పుడు గవర్నర్ రెండు పద్ధతులను పాటిస్తారు.

1) మదింపు లేదా అంచనా వేయకుండా నియమించడం.

2) మదింపు లేదా అంచనా వేయడం.

మొదటి పద్ధతి ప్రకారం విధానసభ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా నిలిచిన పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారు. వారు తిరస్కరిస్తే ఇతర ప్రత్యామ్నాయాలను అమలుచేస్తారు. అయితే కొన్ని సందర్భాల్లో గవర్నర్ తన విచక్షణాధికారాన్ని వినియోగించి అతి పెద్ద పార్టీ లేదా కూటమి కానప్పటికీ మెజారిటీ పొందగలరని భావించిన పార్టీని లేదా కూటమిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తున్నారు. అయితే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించినప్పుడు మాత్రం గవర్నర్ వ్యవస్థ తీవ్ర విమర్శలకు గురవుతోంది. ఉదాహరణకు 2018లో కర్ణాటక విధానసభ ఎన్నికల అనంతరం కూటమిగా ఏర్పడిన కాంగ్రెస్, జనతాదళ్ (S) ను కాదని అతిపెద్ద పార్టీ అయిన భారతీయ జనతా పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. 2017లో గోవా ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్‌ను కాదని భాజపా నాయకత్వంలోని సంకీర్ణ కూటమిని ఆహ్వానించారు.

- ✪ ముఖ్యమంత్రి సలహా మేరకు మంత్రులను నియమించడం, శాఖలు కేటాయించడం, తొలగించడం; శాఖలను మార్చడం లాంటి నిర్ణయాలు తీసుకుంటారు. ఝార్ఖండ్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో గవర్నర్ తప్పనిసరిగా షెడ్యూల్డ్ తెగల సంక్షేమ శాఖామంత్రిని నియమించాల్సి ఉంటుంది.
- ✪ 165 (1) అధికరణ ప్రకారం రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌ను గవర్నర్ నియమిస్తారు. వీరి పదవీకాలం గవర్నర్ సంతృప్తి మేరకు ఉంటుంది.
- ✪ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్, సభ్యులను గవర్నర్ నియమిస్తారు. అయితే వీరిని తొలగించాలంటే సుప్రీంకోర్టు సమర్పించిన నివేదిక ఆధారంగా రాష్ట్రపతి మాత్రమే తొలగించగలరు లేదా 317వ అధికరణలో సూచించిన కారణాల్లో ఏదో ఒక కారణంపై గవర్నర్ వారిని సస్పెండ్ చేయవచ్చు.
- ✪ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను (243 (K) అధికరణ ప్రకారం) నియమిస్తారు. అయితే తొలగించే అధికారం గవర్నర్‌కు లేదా రాష్ట్ర శాసనసభకు లేదు. కేవలం హైకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలో మాత్రమే వీలవుతుంది.
- ✪ రాష్ట్ర ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యులను (243 (I) అధికరణ ప్రకారం) నియమిస్తారు.
- ✪ రాష్ట్ర పరిపాలనకు, శాసనసభలో ప్రవేశపెట్టాలనుకునే బిల్లులకు సంబంధించిన సమాచారాన్ని గవర్నర్‌కు తెలియజేయాలి. పరిపాలనకు సంబంధించి గవర్నర్ కోరిన సమాచారాన్ని ముఖ్యమంత్రి అందించాలి.
- ✪ రాష్ట్ర పరిపాలనకు సంబంధించి రాష్ట్రపతికి ఎప్పటికప్పుడు నివేదికలను సమర్పిస్తారు. అదేవిధంగా రాష్ట్రంలో రాజ్యాంగబద్ధ పాలన కష్టమని భావించినప్పుడు రాజ్యాంగ అత్యవసర పరిస్థితి లేదా రాష్ట్రపతి పాలన (356వ అధికరణ) విధించాల్సిందిగా రాష్ట్రపతికి సిఫారసు చేయగలరు. రాష్ట్రపతి పాలన విధిస్తే రాష్ట్రపతి లేదా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా గవర్నర్ విస్తృతమైన కార్యనిర్వహణాధికారాలను చెలాయిస్తారు.
- ★ రాష్ట్ర పరిధిలో మానవ హక్కుల కమిషన్, మైనారిటీ కమిషన్, మహిళా కమిషన్; ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్ ఛైర్మన్‌లను, సభ్యులను నియమిస్తారు.

### శాసనాధికారాలు

గవర్నర్ రాష్ట్ర శాసనసభలో సభ్యుడు కానప్పటికీ రాజ్యాంగంలోని 168వ అధికరణ ప్రకారం శాసనసభలో అంతర్భాగం.

- రాజ్యాంగంలోని 174(1) అధికరణ ప్రకారం శాసనసభను సమావేశపరచడానికి, సమావేశాలను ప్రోరోగ్ లేదా రద్దుచేయడానికి గవర్నర్‌కు అధికారం ఉంటుంది. 174(2)b ప్రకారం రాష్ట్ర విధానసభను ముఖ్యమంత్రి సలహాపై రద్దు చేయవచ్చు. అయితే విధానసభలో మెజారిటీ కోల్పోయిన ముఖ్యమంత్రి సలహాను గవర్నర్ పాటించాల్సిన అవసరం లేదు. ముఖ్యమంత్రి ఏకారణంగానైనా మెజారిటీ కోల్పోయినట్లు గవర్నర్ భావిస్తే నిర్ణీత గడువు లోపల మెజారిటీ నిరూపించుకోవాల్సిందిగా కోరవచ్చు. నిర్ణీత గడువు లోపల మెజారిటీ నిరూపించుకోలేకపోయినా లేదా ఉద్దేశపూర్వకంగా శాసనసభను సమావేశపరచకపోయినా ముఖ్యమంత్రిని పదవి నుంచి తొలగించగలరు.
- శాసనసభలో ఆంగ్లో ఇండియన్ వర్గానికి తగిన ప్రాతినిధ్యం లేదని భావిస్తే ఆ వర్గానికి చెందిన ఒకరిని విధానసభ సభ్యుడిగా నియమించవచ్చు.
- విధానమండలి ఉంటే, అందులోని మొత్తం సభ్యుల్లో 1/6వ వంతు మందిని విజ్ఞానశాస్త్రం, కళలు, సాహిత్యం, సామాజిక సేవ, ఇతర రంగాల్లో ప్రముఖ వ్యక్తులను నియమించవచ్చు.
- సాధారణ లేదా మధ్యంతర ఎన్నికల తర్వాత జరిగే శాసనసభ మొదటి సమావేశాల్లో, ప్రతి సంవత్సరం జరిగే మొదటి సమావేశాల్లో గవర్నర్ ప్రారంభ ఉపన్యాసం చేస్తారు (176వ అధికరణ).
- శాసనసభ ఆమోదించిన బిల్లు గవర్నర్ ఆమోదంతోనే చట్టం అవుతుంది. తన వద్దకు వచ్చిన బిల్లుకు సంబంధించి గవర్నర్‌కు కింది ప్రత్యామ్నాయాలు ఉంటాయి. అవి

  1. బిల్లుకు ఆమోదం తెలపడం
  2. బిల్లుకు ఆమోదం తెలపకుండా తనవద్దే ఉంచుకోవడం
  3. సాధారణ బిల్లులను (ఆర్థిక బిల్లు కానిది) శాసనసభ పునఃపరిశీలనకు పంపడం
  4. రాష్ట్రపతి ఆమోదం కోసం (200వ అధికరణ ప్రకారం) పంపించడం

- రాష్ట్ర శాసనసభ సమావేశంలో లేని కాలంలో 213 నిబంధన ప్రకారం గవర్నర్ ఆర్డినెన్సులను జారీ చేయవచ్చు. అయితే అవి రాష్ట్ర జాబితాలోని అంశాలై ఉండాలి.
- రాజ్యాంగంలోని 192వ నిబంధన ప్రకారం రాష్ట్ర శాసనసభ్యులను భారత ఎన్నికల సంఘం అభిప్రాయానికి అనుగుణంగా అనర్హులుగా ప్రకటించవచ్చు.

### ఆర్థిక అధికారాలు

1. గవర్నర్ రాజ్యాంగంలోని 202 నిబంధన ప్రకారం రాష్ట్ర వార్షిక ఆర్థిక నివేదికను లేదా రాష్ట్ర బడ్జెట్‌ను శాసన సభలో ప్రవేశపెట్టేలా చూస్తారు.
2. ఆర్థిక బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టడానికి గవర్నర్ ఆమోదం అవసరం.
3. రాజ్యాంగంలోని 267(2) అధికరణ ప్రకారం రాష్ట్ర అగంతుక నిధి గవర్నర్ అధీనంలో ఉంటుంది. దీన్ని రాష్ట్రంలో అనుకోని విపత్తులు సంభవించినప్పుడు ఉపయోగిస్తారు.
4. రాష్ట్ర ఆర్థిక సంఘం నివేదికను శాసన సభలో ప్రవేశపెట్టేలా చూస్తారు.

## గవర్నర్ విచక్షణాధికారాలు

గవర్నర్ ముఖ్యమంత్రి సలహా ప్రకారమే తన అధికారాలు, విధులను నిర్వహించాల్సి ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో మంత్రి మండలి లేదా ముఖ్యమంత్రి సలహా ప్రకారం కాకుండా తన విచక్షణాధికారాన్ని వినియోగించవచ్చు. గవర్నర్‌కు రాష్ట్రపతి కంటే ఎక్కువ సందర్భాల్లో విచక్షణాధికారాలు ఉంటాయి. రాజ్యాంగంలోని 163(2) అధికరణ ద్వారా రాజ్యాంగంలో పేర్కొనని, మంత్రి మండలి సలహా పాటించనవసరంలేని ఏ విషయంలోనైనా గవర్నర్‌కు విచక్షణాధికారాలు ఉంటాయి. ఇవి రెండు రకాలు

1. రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్నవి
2. సందర్భాన్ని బట్టి చెలాయించేవి

- రాష్ట్ర విధానసభ ఎన్నికల తర్వాత ఏ పార్టీకి లేదా కూటమికి స్పష్టమైన మెజారిటీ రానప్పుడు ముఖ్యమంత్రి నియామకం గవర్నర్ విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది.
- ముఖ్యమంత్రి విధానసభలో మెజారిటీ కోల్పోయినట్లు భావిస్తే, సభ విశ్వాసం పొందాల్సిందిగా గవర్నర్ ఆదేశించవచ్చు.
- విధానసభలో మెజారిటీ కోల్పోయిన ముఖ్యమంత్రి ప్రభుత్వాన్ని లేదా మంత్రిమండలిని రద్దు చేయగలరు. అంతేగాక అవసరమైతే మరొకరిని ముఖ్యమంత్రిగా నియమించి, విధానసభలో మెజారిటీ నిరూపించుకోవలసిందిగా కోరవచ్చు.
- మంత్రిమండలి విధానసభలో మెజారిటీ కోల్పోయినప్పుడు గవర్నర్ ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నిస్తారు. అది సాధ్యం కానప్పుడు విధానసభను రద్దుచేసి, రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించాల్సిందిగా రాష్ట్రపతికి సిఫారసు చేయవచ్చు.
- రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించినప్పుడు, ఆ రాష్ట్ర పరిపాలన గవర్నర్ నిర్వహిస్తారు.
- శాసనసభ ఆమోదించిన సాధారణ బిల్లుపై గవర్నర్ వివిధ ప్రత్యామ్నాయాల్లో ఒక దాన్ని ఎంచుకోవచ్చు.
- రాష్ట్ర గవర్నర్ అదనంగా కేంద్రపాలిత ప్రాంత పరిపాలకులుగా వ్యవహరిస్తూ ఉన్నప్పుడు కేంద్రపాలిత ప్రాంత పరిపాలనకు సంబంధించి గవర్నర్ మంత్రిమండలి సలహాతో సంబంధం లేకుండా తన విచక్షణాధికారాలను ఉపయోగించవచ్చు.
- రాష్ట్ర పరిపాలనపై రాష్ట్రపతికి పంపే నివేదిక గవర్నర్ విచక్షణాధికారంపై ఆధారపడి ఉంటుంది.
- రాష్ట్ర పరిపాలనకు సంబంధించి ముఖ్యమంత్రిని సమాచారాన్ని కోరవచ్చు.
- VIవ షెడ్యూల్‌లో పేర్కొన్న రాష్ట్రాల్లోని (అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం) గిరిజన ప్రాంతాల పరిపాలనపై విచక్షణాధికారాలు ఉంటాయి.
- ముఖ్యమంత్రిపై క్రిమినల్ ప్రొసీడింగ్స్ చేపట్టడానికి అనుమతించే అధికారం గవర్నర్‌కి ఉంటుంది.
- ఆర్డినెన్స్ జారీచేసే సందర్భంలో రాష్ట్రపతి ఆమోదానికి పంపవచ్చు. గవర్నర్ రాష్ట్రంలో రాజ్యాంగ రక్షకుడిగా వ్యవహరిస్తారు.

## న్యాయాధికారాలు

గవర్నర్ రాష్ట్ర కార్యనిర్వహణాధికార పరిధిలో ఉన్న న్యాయస్థానాలు విధించిన శిక్షలను మార్పు చేయడం, (Commutation), శిక్షా కాలాన్ని తగ్గించడం (Remission), శిక్షను వాయిదా వేయడం (Reprieve), క్షమాభిక్ష ప్రసాదించడం (Pardon) మొదలైన అధికారాలను కలిగి ఉంటారు. అయితే మరణశిక్షను రద్దుచేసే అధికారం గవర్నర్‌కు లేదు, రాష్ట్రపతికి మాత్రమే ఉంటుంది.

- రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో రాష్ట్రపతి సంబంధిత రాష్ట్ర గవర్నర్‌ను సంప్రదిస్తారు (217వ అధికరణ).
- సబార్డినేట్ కోర్టుల న్యాయమూర్తులను నియమించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. 233వ నిబంధన ప్రకారం వీరి పదోన్నతి విషయంలో కూడా హైకోర్టుతో సంప్రదించి, నిర్ణయం తీసుకుంటారు.
- రాజ్యాంగంలోని 234వ నిబంధన ప్రకారం జిల్లా న్యాయమూర్తులనే కాకుండా ఇతర న్యాయాధికారులను నియమించడానికి అవసరమైన నియమ నిబంధనలను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, హైకోర్టులను సంప్రదించి రూపొందిస్తారు.

**రచయిత: డా. ముప్పాల భాస్కర్ రాజు**